

పోలీసుల ముమ్మర తనిఖీలు

మావోయిస్టు యాక్షన్ టీమ్‌లు
సంచరిస్తున్నాయన్న సమాచారంతో అప్రమత్తం
ముంచంగిపుట్టు, పెదబయలు,
జోలాపుట్టు, కుమడ తదితర ప్రాంతాల్లో గస్తీ

-వార్త 6వ పేజీలో..

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

నిత్యం పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు
ఒకేరోజు ఎస్పీ,
పాడేరు, అరకులోయ ఆర్వోలు తనిఖీ
రాష్ట్రంలో అల్లర్ల నేపథ్యంలో
ఎన్నికల కమిషన్ ఆదేశాలే కారణం


పాడేరులో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నది. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం స్థానిక ఎస్పీ తుహిన్ సిన్హా తనిఖీ చేశారు. అక్కడున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని భద్రతపై ఆరా తీశారు. అలాగే సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించారు. ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరించాలని భద్రతా సిబ్బందికి ఎస్పీ తుహిన్‌సిన్హా సూచించారు. ఇతరులు స్ట్రాంగ్ రూమ్‌ల వైపు ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదన్నారు. కౌంటింగ్ రోజు(జూన్ నెల 4వ తేదీ) వరకు ప్రత్యేక భద్రతా చర్యలు కొనసాగించాలని ఎస్పీ సూచించారు.

ఇద్దరు ఆర్వోలు స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను సోమవారం పాడేరు, అరకులోయ రిటర్నింగ్ అధికారులు తనిఖీలు చేశారు. అరకులోయ ఆర్వో వి.అభిషేక్ అరకులోయ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.


స్ట్రాంగ్ రూమ్‌ల సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్న తుహిన్‌సిన్హా

అలాగే అక్కడ భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాడేరు రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. అరకులోయ ఎంపీ స్థానం, పాడేరు అసెంబ్లీ స్థానానికి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి భద్రతపై ఆరా తీశారు.

అల్లర్ల నేపథ్యమే ప్రత్యేక భద్రతకు కారణం

రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎన్నికల అనంతరం అల్లర్ల నేపథ్యంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలనే ఎన్నికల కమిషన్ ఆదేశాలతోనే జిల్లా స్థాయి అధికారులు, రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లను నిత్యం తనిఖీలు చేస్తూ, భద్రతా చర్యలపై ఆరా తీస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత విషయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టడంతోపాటు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పాడేరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి జిల్లాలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాల్లో 1,118 మంది టెన్త్ విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులందరికీ హాల్ టికెట్‌లు జారీ చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను పక్కాగా అమలు చేస్తామన్నారు. కాగా జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులు 424 మంది, ఇంటర్ 321 మంది విద్యార్థులు జూన్ ఒకటో తేదీ నుంచి పరీక్షలకు హాజరవుతారన్నారు.

రేపటి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

ప్రభుత్వం బకాయిలు
విడుదల చేయకపోవడమే కారణం
జిల్లాలో రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లు..



విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా అందించే సేవలను ఈ నెల 22 నుంచి నిలిపివేయాలని నెట్‌వర్క్ పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. ప్రభుత్వం గడిచిన కొన్ని నెలల నుంచి బకాయిలను చెల్లించకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.1,500 కోట్లు చెల్లించాల్సి ఉండగా, విశాఖలో 50కుపైగా ఆస్పత్రులకు రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లు వరకూ చెల్లించాల్సి ఉంది.

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మూడుసార్లు సమ్మె నోటీసులు ఇవ్వగా రెండు పర్యాయాలు రూ.300 కోట్లు వరకూ విడుదల చేసింది. అయినప్పటికీ బకాయిలు భారీగానే ఉండడంతో ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా ఉందని ఆస్పత్రుల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఈ నెల పదో తేదీన రూ.500 కోట్లు విడుదల చేస్తామని ఆరోగ్యశ్రీ సీఈవో ఇచ్చిన హామీ నెరవేరక పోవడంతో ఆస్పత్రులు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పూర్తిస్థాయిలో వైద్య సేవలు నిలిపివేస్తామని హెచ్చరిస్తున్నాయి.

అటవీ సెక్షన్‌లో అక్రమాలెన్నో?

అక్రమార్కులతో చేతులు కలిపిన కొయ్యూరు సెక్షన్ సిబ్బంది

విలువైన చెట్లను నరికి స్మగ్లర్లకు
అప్పగింత
వాటాల పంపిణీలో తేడాలు రావడంతో
ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
ఉన్నతాధికారుల
విచారణలో వెలుగులోకి అక్రమాలు


సోలాబు టేకు ప్లాంటేషన్‌లో టేకు చెట్లను నరికివేయడంతో మిగిలిన మొదళ్లు

కొయ్యూరు, మే 20: కొయ్యూరు అటవీ సెక్షన్ సిబ్బంది బరితెగించి అక్రమార్కులతో చేతులు కలపడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ సెక్షన్ సిబ్బంది తమ పరిధిలోని అటవీ ప్రాంతంతో పాటు వేరే సెక్షన్ బీటులకు సంబంధించిన ప్రాంతంలో కూడా విలువైన చెట్లను నరికి కలపను తరలించేయడం కలకలం రేపుతోంది. పంపకాల విషయంలో తేడాలు రావడంతో వారి అక్రమార్కులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

మంప, కాకరపాడు గార్డులతో పాటు మిగిలిన సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి అటవీ సంపదను అక్రమంగా దోచి పెడుతూ అక్రమార్జనకు పాల్పడినట్టు సమాచారం. దీనిపై మూడు జిల్లాలకు సంబంధించిన స్క్వాడ్ డీఎఫ్‌వో, అటవీశాఖకు చెందిన రాష్ట్ర విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో అసలు విషయం బయట పడింది. గత రెండు నెలలుగా గోప్యంగా జరుగుతున్న ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. చింతపల్లి అటవీ డివిజన్ పెదవలస రేంజ్ కొయ్యూరు అటవీ సెక్షన్ పరిధిలో గల చింతవానిపాలెం అటవీ ప్రాంతంలో కారపాడు, మంప బీట్‌లకు చెందిన సిబ్బంది సహకారంతో 142 నల్లమద్ది చెట్లను నేలకూల్చి వాటి కలపను తూర్పు గోదావరి జిల్లాకు తరలించారు. అంతే కాకుండా సోలాబు సమీప అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో 1990కు ముందు వేసిన టేకు ప్లాంటేషన్‌లో 50 చెట్లను గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. అయితే ఈ ప్లాంటేషన్ వేసిన అనంతరం మొక్కలు పెరిగే క్రమంలో అటవీశాఖ తగిన శ్రద్ధ చూపకపోవడంతో వేసిన మొక్కలన్నీ చనిపోయినట్టుగా అప్పట్లో నిర్ధారించారు. అయినా అందులో సుమారుగా 200కు పైగా మొక్కలు ప్రస్తుతం వృక్షాలయ్యాయి దీన్ని ఆసరాగా చేసుకున్న సిబ్బంది అందులో చెట్లు అక్రమంగా తరలించే చర్యలకు పూనుకున్నారు. అంతటితో ఆగని సిబ్బంది వారికి సంబంధం లేని శరభన్నపాలెం బీట్‌లో గల అంతాడ పంచాయతీ ఎద్దుమామిడి అటవీ ప్రాంతంలో గల సుమారు 40 మలబారు వేపచెట్లను నేలకూల్చి స్మగ్లర్లకు అప్పగించారు. శరభన్నపాలెం బీటులో చేరిన ఎద్దుమామిడి అటవీ ప్రాంతాన్ని సంరక్షించే గార్డు రొంపుల ఘాట్ రోడ్డులో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో విధులు నిర్వహిస్తుండగా, ఈ బీటు పరిధి కాకరపాడు బీటు పరిధి లోనిదే అని నమ్మబలికి కాకరపాడు బీటు ఆఫీసర్ (గార్డు) చొరవతో అక్కడ అటవీ ప్రాంతంలో గల ప్లేవుడ్, ఐస్ క్రీం పుల్లల తయారీకి వినియోగించే ... మిగతా 6వ పేజీలో


సోలాబు అటవీ ప్రాంతంలో నరికిన టేకు చెట్లు

బలిమెల నీటి వినియోగంపై భేటీ

బలిమెల, జోలాపుట్‌లలో నీటి నిల్వ 23.4123 టీఎంసీలు
ఆంధ్రా వాటా 7.8586, ఒడిశా వాటా 15.5537 టీఎంసీలు
ఆంధ్రా, ఒడిశా అధికారుల నీటి పంపకాలు


బలిమెల జలాశయంలోని నీటి వినియోగంపై సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

సీలేరు, మే 20: ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలోని నీటి వినియోగంపై ఇరు రాష్ట్రాల అధికారులు సోమవారం ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ఓహెచ్‌పీసీ కార్యాలయంలో సమావేశమై ఏయే రాష్ట్రం ఎంతెంత నీటిని వినియోగించుకుందో లెక్కలు కట్టారు. 2024 ఏప్రిల్ నెలలో ఆంధ్రా తన వాటాగా 4.7937 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు, ఒడిశా 9.1148 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు లెక్కలు కట్టారు. దీని ప్రకారం ఏప్రిల్ నెలలో ఆంధ్రా కంటే ఒడిశా 6.0627 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ధారించారు. అలాగే 2023 - 2024 నీటి సంవత్సరంలో జూలై 2023 నుంచి 2024 ఏప్రిల్ నెలాఖరు నాటికి ఆంధ్రా తన వాటాగా మొత్తం 59.1210 టీఎంసీల నీటిని వినియోగించుకుందని, అలాగే ఒడిశా కూడా 2023 - 2024 నీటి సంవత్సరంలో 2024 ఏప్రిల్ నెలాఖరు నాటికి మొత్తంగా 51.4259 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్టు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఆంధ్రా.. ఒడిశా కంటే 7.6951 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 23.4123 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని, వీటిలో ఆంధ్రా వాటాగా 7.8586 టీఎంసీలు, ఒడిశా వాటాగా 15.5537 టీఎంసీలుగాను పంపకాలు జరిపారు. బలిమెల, జోలాపుట్ నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాల సీజన్ ప్రారంభమయ్యేంత వరకు ఉన్న నీటి నిల్వలను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రస్తుతం విద్యుత్ డిమాండ్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తం బలిమెల నుంచి ఆంధ్రాకు 2000 క్యూసెక్కుల నీటిని, ఒడిశాకు 2500 క్యూసెక్కుల నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది.

ఈ సమావేశంలో ఒడిశా తరఫున పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ పీతబాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమాకాంత పాత్రో, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తుషార్‌రంజన్ కుంతియ, ఏఈలు గదాధర్ ప్రధాన్, కేసీ పాణి, బలిమెల హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు ఎ.శివప్రసాద్‌రావు(జీఎం), జ్యోతిర్మయిదాస్(డిప్యూటీ మేనేజర్), ఓం ప్రకాశ్‌నాయక్ (అసిస్టెంట్ జనరల్ మేనేజర్), క్షౌనిష్ బెహరా (డిప్యూటీ మేనేజర్), రాకేష్ పాణిగ్రహి (అసిస్టెంట్ మేనేజర్) లు పాల్గొనగా, ఆంధ్రా తరఫున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు అధికారులు ఈఈ ప్రభాకరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటమధు, ఏఈఈ సీహెచ్ సురేశ్ పాల్గొన్నారు.

వ్యాధులతో పశువులు విలవిల

జబ్బవాపు, డెక్కవాపు, గాలికుంటు వ్యాధులతో సతమతం
పాడేరు మండలం లగిశపల్లి పంచాయతీలో ఇప్పటికే 50 పశువులు మృతి

-వార్త 6వ పేజీలో..

కొనసాగుతున్న వర్షాలు

జీకేవీధిలో కూలిపోయిన పాఠశాల రేకుల షెడ్డు
లోతట్టు ప్రాంతాలు జలమయం
జనజీవనానికి అంతరాయం

పాడేరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం సైతం మన్యంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాయడం, ఆ తరువాత వర్షం కురవడం పరిపాటిగా మారింది. పాడేరుతో పాటు ఏజెన్సీ వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి రోడ్లన్నీ చిత్తడికాగా, పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరుతున్నది. దీంతో వేసవి దుక్కి పనులకు తాజా వర్షాలు అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గూడెంకొత్తవీధిలో..

గూడెంకొత్తవీధి: మండలంలో పలు చోట్ల సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి, సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మండల కేంద్రంతో పాటు సీలేరు, ధారకొండ, సప్పర్ల, లక్కవరం ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. లక్కవరంలో భారీ వర్షానికి ప్రాథమిక పాఠశాల రేకుల షెడ్డు కూలిపోయింది. ప్రస్తుతం పాఠశాలకు సెలవులు కావడంతో పెనుప్రమాదం తప్పింది.



గూడెంకొత్తవీధిలో వర్షం. (ఇన్‌సెట్లో) జీకే వీధి లక్కవరంలో భారీ వర్షానికి కూలిపోయిన ప్రాథమిక పాఠశాల రేకుల షెడ్డు


వర్షం వల్ల నిర్మానుష్యంగా మారిన పెదబయలు వారపు సంత

కొయ్యూరులో..

కొయ్యూరు: మండల వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. అయితే మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఉక్కపోతతో అల్లాడిన జనం వర్షానికి ఊరట చెందారు.

పెదబయలులో..

పెదబయలు: మండల కేంద్రంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. వర్షం ధాటికి వారపు సంత వెలవెలబోయింది. మధ్యాహ్నం కురిసిన వర్షానికి వారపు సంతకు వచ్చిన కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. దీంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు.

విశాఖలో డెంగ్యూ కలకలం

ఈ ఏడాది అప్పుడే వెలుగుచూస్తున్న కేసులు
ఇప్పటివరకూ 140
నమోదైనట్టు మలేరియా శాఖ నిర్ధారణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) విశాఖలో ఈ ఏడాది అప్పుడే డెంగ్యూ కేసులు వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో దోమల వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో డెంగ్యూ కేసులు నమోదవుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నెల రోజులు ముందుగానే డెంగ్యూ కేసుల నమోదు ప్రారంభం కావడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ఏటా జూన్‌లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించడంతో వర్షాలు ప్రారంభమవుతుంటాయి. దీని వల్ల వాతావరణ చల్లబడుతుంది. ఇది దోమల వ్యాప్తికి అనుకూలంగా మారుతుంది. వర్షాకాలంలో పారిశుధ్య లోపం తలెత్తుతుంది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోవడం, డ్రైనేజీ పొంగి రోడ్లపైకి చేరుకోవడం, వర్షం నీరు ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి బొండాలు, పూలకుండీల్లో నిల్వ ఉండిపోవడం వల్ల దోమల వ్యాప్తి మరింత ఎక్కువగా ఉంటుంది. సాధారణ దోమలతోపాటు డెంగ్యూ కారక దోమలు (ఈడిస్) కూడా విజృంభిస్తుంటాయి. వీటన్నింటి కారణంగా ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకూ డెంగ్యూ కేసుల ... మిగతా 6వ పేజీలో

తాగునీటికి కటకట


గ్రామానికి దూరంగా ఉన్న ఊటల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న దృశ్యం

ఎగువ గుడ్డి గ్రామస్థులకు ఊటనీరే దిక్కు
అలంకారప్రాయంగా మంచినీటి పథకం
మంచినీటి సౌకర్యం
కల్పించాలని ఖాళీ బిందెలతో నిరసన

అరకులోయ, మే 20: అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధి ఎగువ గుడ్డి గ్రామస్థులకు మంచినీటి సదుపాయం లేక అల్లాడిపోతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న ఊటల నుంచి నీరు తెచ్చుకుని తాగుతున్నారు. దీని వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో తమకు తాగునీటి వసతి కల్పించాలని సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద కొళాయిలు ఏర్పాటు చేసినా చుక్కనీరు రావడం లేదు. దీంతో పురుషులు, మహిళలు బిందెలు, కావిళ్లతో గ్రామానికి దూరంగా ఉన్న ఊటల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. తమ సమస్యను అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని గిరిజన సహకార సంఘం నాయకులు కె.సింహాచలం, కోటపర్తి సన్యాసిరావు, పొట్టంగా సన్యాసమ్మతో పాటు గ్రామస్థులు చెప్పారు.

క్రైం... crime news

అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి


గంగరాజు (ఫైల్)

మాకవరపాలెం, మే 20: గత నాలుగు రోజులుగా అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని సుభద్రయ్యపాలెం గ్రామానికి చెందిన అట్టుమూరి గంగరాజు (53) తాళ్ళపాలెం వద్ద గల ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయల్దేరిన అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో వెతకసాగారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంతలో సోమవారం పీపీ అగ్రహారం వద్ద సరుగుడు తోటలో గంగరాజు మృతదేహం ఉన్నట్టు సమాచారం తెలుసుకుని అక్కడికి వెళ్లి చూశారు. తోటలో గంగరాజు అనుమానాస్పదంగా మృతిచెంది ఉన్నాడని ఎస్ఐ వివరించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వివాహిత ఆత్మహత్య

గోపాలపట్నం, మే 20: అనారోగ్య సమస్యల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన 89వ వార్డు పరిధి సంతోశ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంతల మోహనరావు అనే రైల్వే ఉద్యోగి భార్య పైడమ్మ (కమల), నలుగురు పిల్లలతో కలిసి కొత్తపాలెంలోని సంతోశ్‌నగర్ కాలనీలో నివసిస్తున్నారు. ఈ నెల 18న మోహనరావు తమ కుమారుడితో కలిసి తిరుపతి వెళ్లారు. ఆదివారం రాత్రి భోజనాలు చేశాక కమల ఒంటరిగా ఇంట్లో నిద్రించగా, ముగ్గురు పిల్లలు మేడపై పడుకున్నారు. అయితే సోమవారం ఉదయం పిల్లలు కిందకు వచ్చి చూసేసరికి తల్లి వంట గదిలోని ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఉండడం చూసి స్థానికులకు తెలిపారు. వారు వచ్చి చూసేసరికే ఆమె మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. కమల అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబీకులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

తగరపువలస, మే 20 : జీవీఎంసీ రెండో వార్డు సంతపేటలో సోమవారం పిచ్చి కుక్క దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సంతలో కూరగాయలు అమ్మడానికి వచ్చిన సూరయ్యపై దాడి చేసిన పిచ్చి కుక్క అక్కడికి సమీపంలోనే సీరపు లోకేష్, అభిరామ్ అనే చిన్నారులను కూడా గాయపర్చింది. స్థానికులు బాధితులను పట్టణ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా ఈ ప్రాంతంలో కుక్కల సంచారం అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కూడళ్లలో గుంపుగా చేరి పాదచారులు, వాహనదారులపై దాడికి పాల్పడుతు న్నాయి. ముఖ్యంగా రాత్రి వేళ వాహనాల వెంట పరుగు తీస్తుండడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

'రైవాడ'పై నిర్లక్ష్యపు నీడ!

- జలాశయం లోపల పేరుకుపోయిన తుప్పలు
- గట్టు మొత్తం గోతులమయం
- పట్టించుకోని అధికారులు
- సమీప గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు


గోతులతో దర్శనమిస్తున్న గట్టు


జలాశయం గర్భంలో పేరుకుపోయిన తుప్పలు

దేవరాపల్లి, మే 20 : మండలంలోని రైవాడ జలాశయంపై నిర్లక్ష్యపు నీడ వీడడం లేదు. ఏళ్ల తరబడి దీనిని పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా జలాశయ గర్భంలో తుప్పలు పేరుకుపోగా, బయట గట్టు అత్యంత దారుణంగా తయారైంది. పెద్ద పెద్ద గోతులు పడడంతో దీనిపై అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. జలాశయం గట్టు మొత్తం 5.5 కిలోమీటర్లు పొడవు కాగా, దాదాపు గట్టం ఇదే తరహాలో ఉంటుందని పలువురు వాపోతున్నారు. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దీనిని పట్టించుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జలాశయం గట్టు ఎప్పటికప్పుడు పటిష్టం చేయాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టలేదని అంటున్నారు. భారీ వర్షాలు కురిసే సమయాల్లో జలాశయంలో నీరు పుష్కలంగా చేరితే అదనపు నీరు కిందకు పోయే విధంగా గట్టు ఉండాలి. కాని ప్రస్తుతం గట్టు పరిస్థితి చూస్తే అత్యంత దారుణంగా ఉందని అంటున్నారు. దీంతో చిన సోంపురం నుంచి రైవాడకు వచ్చే మార్గంలో గట్టుపై వేసిన రోడ్డు పూర్తిగా పాడైంది. పెద్ద పెద్ద గోతులు పడడంతో మట్టిని ఆయా గుంతల్లో కప్పి చేతులు దులుపుకున్నారు. అంతేకాక గట్టు మీదుగా తామరబ్బ, చింతలపూడి పంచాయతీలకు వెళితే మూడు కిలోమీటర్లు వరకు దూరం కలిసి వస్తుంది. అలాగే, అనంతగిరి, అరకు, ఎస్.కోట వెళ్లడానికి దగ్గర మార్గం కూడా ఇదని అంటున్నారు. కానీ ఈ మార్గం సక్రమంగా లేకపోవడంతో చుట్టూ తిరిగి కాశీపురం మీదుగా చినసోంపురానికి రావాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గట్టుపై రోడ్డు దుస్థితి ఇలా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలావుంటే, జలాశయం గర్భంలో తుప్పలుతో పేరుకు పోయాయి. దీని వలన చెట్ల వేర్లు రాతికట్టులోకి వెళ్లి గట్టు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గట్టును పటిష్టం చేయడంతో పాటు దీనిపై ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేయాలని, జలాశయం గర్భంలోని చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కౌంటింగ్ ముగిసేవరకు సంయమనం పాటించండి

- డీజేలు, బాణసంచా నిషేధం
- సమస్యాత్మక గ్రామాల్లో పెట్రోలింగ్, పికెటింగ్
- పెట్రోల్ లూజ్ అమ్మకాలు నిషేధం
- పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ


గుల్లేపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ

సబ్బవరం, మే 20: ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ పూర్తయ్యేవరకూ ప్రజలు సంయమనం పాటించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్పీ కేవీ మురళీకృష్ణ, విశాఖ ఎస్పీ విశాల్‌గున్నీ ఆదేశాల మేరకు స్థానిక సీఐ పిన్నింటి రమణతో కలిసి పలు గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, పెట్రోల్ బంకులను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పరవాడ సబ్‌డివిజన్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు సహకరించారని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ అదేవిధంగా ఉండాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పండగలు, శుభకార్యాల్లో స్టేజ్ ప్రోగ్రామ్‌లు, ఊరేగింపులు, డీజే సౌండ్లు, బాణసంచా పేలుళ్లు నిషేధించామన్నారు. బెట్టింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో పెట్రోలింగ్, పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. లూజ్ పెట్రోలు అమ్మకం నిషేధించామన్నారు. రాజకీయ నేతలు సభలు, సమావేశాలు ఏర్పాటుకు తప్పనిసరిగా ఆర్వో అనుమతులు తీసుకోవాలని సూచించారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు, అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

చేపల వేట సమయంలో మత్స్యకారులు జాగ్రత్తలు వహించాలి

- మెరైన్ పోలీస్ సీఐ గోవిందరావు


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

అచ్యుతాపురం, మే 20: మత్స్యకారులు సముద్ర వేట సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పూడిమడక మెరైన్ పోలీస్ సీఐ గోవిందరావు అన్నారు. సోమవారం కోస్ట్ గార్డులు పూడిమడకలో మత్స్యకాలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలో చేపల వేట చేసే సమయంలో అనారోగ్యానికి గురైతే వెంటనే 1554 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. అలాగే వేట సమయంలో అపరిచిత బోట్లు, వ్యక్తులు కనబడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్స్యకారులు అందించే ప్రతి సమాచారాన్ని తాము ముఖ్యంగా తీసుకొని వెంటనే స్పందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ సిరాజ్ బాబు, పల్లి రాజేష్, ఎం. వెంకటరావు, అంకిత్, కంటుముచ్చు ముసలి, పి.శ్రీనివాసరావు, కదిరి గుర్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వానర మూక సంచారం

- ఇళ్లు, రోడ్లపైన దాడులు
- ఏడాది తర్వాత తెర మీదకు సమస్య
- కోతులను పట్టించాలని కోరుతున్న పట్టణవాసులు


కొత్తపేట ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న వానర మూక

ఎలమంచిలి, మే 20 : పట్టణ వీధుల్లో విచ్చలవిడిగా వానరాల మూక సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఇళ్లపైన, చెట్లపైన సంచరించే వానరాలు ఇటీవల రోడ్లపైనే సంచరిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏడాది కాలం నుంచి వానరాల సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఆరేళ్ల క్రితం వానర మూక సమస్య తీవ్రతరం కావడంతో అప్పటి మునిసిపల్ అధికారులు వానరాల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టి అటవీప్రాంతాలకు తరలించారు. మరలా ఏడాది నుంచి వానరాల సమస్య తెర మీదకు వచ్చింది. వానరమూక కారణంగా ఇళ్లలోని వస్తు సామగ్రితో పాటు తినుబండారాలు, పండ్ల జాతి మొక్కలపై తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తూ నష్టపరుస్తున్నాయి. వానరాలు ఇళ్లలోనూ, వీధుల్లో సైతం ప్రజలపై దాడి చేస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మునిసిపల్ అధికారులు వానరాల సమస్యను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎర్రాజీ జ్యోతి ఖాతాలో మరో పసిడి పతకం



పతకాలు సాధించిన జ్యోతి

విశాఖపట్నం (స్పోర్ట్సు), మే 20: నెదర్లాండ్‌లో ఆదివారం రాత్రి జరిగిన హ్యారీ స్కల్డింగ్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో నగరానికి చెందిన ఎర్రాజీ జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌ను 13.06 సెకన్లలో పూర్తిచేసి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఇటీవల హంగేరీలో జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లోనూ జ్యోతి స్వర్ణ పతకం సాధించింది. కాగా జూన్ 30వ తేదీతో ఒలింపిక్స్ క్వాలిఫైయింగ్ మీట్స్ ముగియనున్న నేపథ్యంలో అప్పటిలోగా జ్యోతి మరో ఐదు మీట్స్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ఈ నెలలో వరుసగా జరిగిన రెండు అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన నేపథ్యంలో త్వరలో జరగనున్న ఈవెంట్లలోనూ ప్రతిభ కనబరుస్తుందని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావుతో పాటు ఇతర ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం

- విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి రాధారత్నం


శిబిరంలో పాల్గొన్న న్యాయాధికారులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు రాధారత్నం

విశాఖపట్నం (లీగల్), మే 20 : న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతో పాటు సత్వర న్యాయానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు కె. రాధారత్నం అన్నారు. సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా నూతన కోర్టుల కాన్ఫరెన్సు హాలులో న్యాయాధికారుల ఐదు రోజుల శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన మెళుకువలను న్యాయాధికారులు తెలుసుకొని కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వివాహ సంబంధ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ జాతీయ శిక్షకులు వీకే బన్సల్, సునీల్ కుమార్ అగర్వాల్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 29 మంది న్యాయాధికారులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక బోధనా పార్య ప్రణాళికలపై శిక్షణ

అనకాపల్లి రూరల్, మే 20: జిల్లాలోని తేగాడ ఆదర్శ పాఠశాలలో సోమ, మంగళవారాల్లో సీబీఎస్ఈ గల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లీషు, జీవశాస్త్రం, సోషల్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణాత్మక బోధనా పార్య ప్రణాళికలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ శిక్షణకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి 294 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (పాఠశాల విద్య) విజయభాస్కర్ హాజరై పలు సూచనలను చేశారన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


వాడచీపురుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పరవాడ, మే 20 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో కేంద్ర బలగాలు సోమవారం గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, పరవాడ గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. బెట్టింగ్‌లు, వివాదాలకు దూరంగా ఉండాలని, స్టేజి ప్రోగ్రాలు నిర్వహించకూడదని సీఐ బాలసూర్యారావు అన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

వలంటీర్లు సరిగా సహకరించలేదు

- చోడవరం వైసీపీ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వెల్లడించిన నేతలు
- కొందరు నాయకులు సైతం ప్రత్యర్థులతో కుమ్మక్కయ్యారని విప్ ఆరోపణ
- వారికి తగిన బుద్ధి చెప్పుతానని ధర్మశ్రీ హెచ్చరిక



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, మే 20: సార్వత్రిక ఎన్నికల్లో వలంటీర్లు అనుకున్న విధంగా తమకు సహకారం అందించలేదని కొందరు నాయకులు విప్, చోడవరం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వద్ద వాపోయారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో ధర్మశ్రీ సమావేశమయ్యారు. తొలుత ఎన్నికల్లో పోలింగ్ శాతం తీరుతెన్నులను సమీక్షించారు. ఈ సందర్భంగా కొన్ని పంచాయతీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ తాము నియమించిన వలంటీర్లే ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయకుండా వ్యవహరించారని ఆరోపించారు. దీనివల్ల అనుకున్న స్థాయిలో ఓట్లు రాబట్టలేకపోయామని వెల్లడించారు. పార్టీలో కొందరు నాయకులు సైతం ప్రత్యర్థులతో కుమ్మక్కై పార్టీకి దెబ్బకొట్టే విధంగా వ్యవహరించారని, అటువంటి వారికి తగిన బుద్ధి చెపుతానని ధర్మశ్రీ హెచ్చరించారు. కాగా నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో వైసీపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు ఒడిశా దాసుడు పూజలు


నడచి వస్తున్న ఒడిశా దాసుడు

సింహాచలం, మే 20 : ఒడిశాలోని బరంపురం జిల్లా పట్టుపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంత్ నాయకో దాసుడు సోమవారం వరాహలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఏటా స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవం తరువాత బంధుమిత్రులు, శిష్య పరివారంతో ఆయన సింహగిరికి వచ్చి మూడు నెలలు పాటు తమ భవనంలో బస చేసి ప్రతిరోజూ స్వామివారిని పూజించ డం ఆనవాయితీ. ఈమేరకు ఆయన స్వామిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని నూనె భండారం వద్ద ప్రత్యేక దీపారాధనలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మామిడి విక్రయదారులపై దాడులు

- మూడు బృందాలు ఏర్పాటు
- జ్ఞానాపురం పండ్ల మార్కెట్‌లో 125 ఇథోపాన్ ప్యాకెట్ల సీజ్
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్
- రసాయనాల వినియోగంపై స్పందించిన జేసీ


మామిడి విక్రయదారులపై దాడులు చేస్తున్న అధికారులు... (ఇన్‌సెట్‌లో) రసాయనాలు కలిపిన మామిడికాయలు

విశాఖపట్నం, మే 20 (ఆంధ్రజ్యోతి): మామిడిని మగ్గబెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తున్న వ్యాపారులపై అధికారులు దృష్టిసారించారు. 'మామిడిపై రసాయనాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ రసాయనాలు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీఏటీ నందాజీ మూడు బృందాలను ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వ హించారు. జ్ఞానాపురంలోని పండ్ల మార్కెట్‌లో నందాజీ ఆధ్వర్యంలోని బృందం నిర్వహించిన తనిఖీల్లో శ్రీదుర్గా పండ్ల దుకాణంలో 30 క్రేట్లలో 125 ఇథోపాన్ ప్యాకెట్లు ఉండడాన్ని గుర్తించారు. ఈ ప్యాకెట్లను సీజ్ చేసిన అధికారులు..మామిడి పండ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా మామిడి వ్యాపారులతో నందాజీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఇథలిన్, ఇతర రసాయనాలను వినియోగించకూడదన్నారు. రసాయ నాలు వినియోగించినట్టు తేలితే వ్యాపారులకు భారీ జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని స్పష్టంచేశారు. పండ్లపై రసాయనాలు వినియోగించినట్టు అనిపిస్తే ఎవరైనా తమకు ఫిర్యాదు (98490 47761, 9773683667, 9566760283, 9912199284) చేయవచ్చునని నందాజీ తెలిపారు. మరో రెండు బృందాలు నగర పరిధిలో పండ్ల వ్యాపారం ఎక్కువగా సాగే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాయి.



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న గిడ్డి ఈశ్వరి, సర్పంచ్ సునీల్

పాడేరులో టీడీపీదే విజయం

▸▸ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, మే 20: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీదే విజయమని పార్టీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం లోతుగెడ్డ వచ్చిన ఆమె వీరభద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ, ఒక్క ఛాన్స్ అని ప్రాధేయపడితే జగన్మోహన్‌రెడ్డికి ఆదివాసీలు రెండు పర్యాయాలు ఓట్లువేసి వైసీపీ ఎమ్మెల్యేను గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చిన జగన్ ఆదివాసీల అభివృద్ధిని విస్మరించారన్నారు. గ్రామాలకు కనీస రహదారులు, ఆదివాసీలకు తాగునీటి పథకాలు అందుబాటులోలేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 15 రకాల పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, దీంతో ఆదివాసీల్లో వైసీపీపై వ్యతిరేకత పెరిగిందని చెప్పారు. వైసీపీ వ్యతిరేక ఓటు టీడీపీకి పడిందన్నారు. పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ టీడీపీకి ఓట్లు బాగానే పడ్డాయన్నారు. జూన్ 4వ తేదీన నియోజకవర్గం టీడీపీ శ్రేణులు, ఆదివాసీలు సంబరాలు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా ఆదివాసీలు కోరుకుంటున్న జీవో నంబరు-3 అమలులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని, దీనికి చంద్రబాబు సైతం హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిన పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. మైనింగ్ మాఫియాకు కళ్లెం వేస్తామని, యర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దుచేసి ఆదివాసీ గ్రామాలను కాపాడుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతర్ల సునీల్, టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, సోమేశ్, లక్కోజు నాగభూషణం పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు



రాజకీయ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేశ్

జి.మాడుగుల, మే 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రమేశ్ సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం వైసీపీ నేతలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు. గొడవలకు పాల్పడితే అందరూ ఇబ్బందులు పడతారని సూచించారు. అనంతరం పెట్రోల్ బంకులు నుంచి విడిగా విక్రయాలు చేయరాదని, నిల్వ ఉంచుకుని విక్రయాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని బంకుల యజమానులకు సీఐ రమేశ్, ఎస్ఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ మేరకు పెట్రోల్ బంకుల ఇన్‌చార్జులకు నోటీసులు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సీలేరు, మే 20: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మస్తాన్‌వల్లీ సూచించారు. గూడెంకొత్తవీధి మండలంలోని చంతపల్లి క్యాంప్‌లో సోమవారం ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 56 మంది గిరిజనులకు వైద్యాధికారి, సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించారు. వీరిలో ఒకరికి మలేరియా నిర్ధారణ కావడంతో మలేరియా కోర్సుకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. మలేరియా సోకిన ఇంట్లో కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలను చేశారు. అలాగే ప్రసవ సమయంలో ఆసుపత్రిలోనే చేరాలని గ్రామంలోని గర్భిణులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై గిరిజనులకు వైద్యాధికారి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ప్రతీ ఇంట్లోనూ దోమల నివారణ మందును పిచికారీ చేయించారా? లేదా? అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, సిబ్బంది ఎం.దేవి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాజారావు

చింతపల్లి, మే 20: శాంతిభద్రతలు పరిరక్షించేందుకు రాజకీయ పార్టీల నాయకులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని అన్నవరం ఎస్ఐ రాజారావు కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వైసీపీ, జనసేన, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులతో సోమవారం వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోరాదన్నారు. ఎక్కడా రాజకీయ వివాదాలకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్నేహ సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ఫలితాల రోజు, ఫలితాలు అనంతరం హింసాత్మక ఘటనలకు చోటు చేసుకోకుండా నాయకులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

విశాఖలో డెంగ్యూ కలకలం

... 3వ పేజీ తరువాయి

ఉధృతి ఎక్కువగా ఉంటుంది. డెంగ్యూ బారినపడినవారు సకాలంలో చికిత్స తీసుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. దీంతో డెంగ్యూ అంటే ప్రజలతోపాటు జీవీఎంసీ అధికారుల్లో ఆందోళన మొదలవుతుంది.

విశాఖలో ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకూ 1,500 నుంచి రెండు వేల వరకూ డెంగ్యూ కేసులు నమోదవుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం మే నుంచే డెంగ్యూ కేసుల నమోదు ప్రారంభమైంది. గత కొద్దిరోజులుగా అడపాదడపా వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడి దోమల వ్యాప్తికి అనుకూలంగా మారింది. దీనివల్ల ఇప్పటివరకూ 146 డెంగ్యూ కేసులు నమోదవ్వగా, వీటిలో దాదాపు సగం గత రెండు రోజుల్లో నమోదైన వేనంటున్నారు. ఈ నెల మొదట్లో రోజుకి ఒకటి, రెండు చొప్పున నమోదైతే, ఇటీవల వీటి సంఖ్య భారీగా పెరిగినట్టు చెబుతున్నారు. జిల్లా మలేరియా విభాగం అధికారులు విశాఖ పరిధిలో భారీగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నట్టు జీవీఎంసీ అధికారులకు రోజువారీ నివేదికలు ఇస్తుంటే...అధికారులు మాత్రం అసలు డెంగ్యూ కేసు ఒక్కటీ కూడా నమోదుకావడం లేదని బుకాయిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొమ్మాది ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో కేజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడిని జిల్లా మలేరియా అధికారిణి స్వయంగా వెళ్లి పరామర్శించారు. అయినప్పటికీ జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ అధికారులు మాత్రం అలాంటి కేసులు అధికారికంగా నిర్ధారణ కావడం లేదని చెప్పడం విశేషం. దీనికి సంబంధించిన ఫొటోలను చూపించేసరికి...ఒక కేసు మాత్రమే నమోదైందని, అక్కడ యాంటీ లార్వా ఆపరేషన్ చేసి, రెండుచోట్ల దోమల బ్రీడింగ్ గుర్తించి నాశనం చేశామని, ఆ ప్రాంతంలోని 151 ఇళ్లలో ఫాగింగ్ కూడా చేశామని చెప్పడం చూస్తే...జీవీఎంసీ అధికారులు డెంగ్యూపై గోప్యత పాటిస్తున్నారని అర్థమయ్యింది.

ఇసుక రీచ్‌లు పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఎటపాక, మే 20: ఎటపాక మండలంలోని పలు ఇసుక రీచ్‌లను సోమవారం జిల్లా కలెక్టర్ విజయ సునీత పరిశీలించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలంటూ మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇసుక రీచ్‌లను పరిశీలించారు. మండలంలో గొమ్ముకొత్తగూడెం, రాయనపేట, గుండాల, కన్నాయిగూడెం ఇసుక రీచ్‌లను పరిశీలించి, అధికారులకు సూచనలు జారీ చేశారు. రాయనపేట, కన్నాయిగూడెం ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనుకూలంగా లేవని, గుండాల, గొమ్ముకొత్తగూడెం ఇసుక రీచ్‌లు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట పీవో కావూరి చైతన్య, ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసిన విద్యార్థులందరికీ గురుకుల సీట్లు కేటాయించాలి

పాడేరు రూరల్, మే 20: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసిన ప్రతీ విద్యార్థికి సీటు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో నాయకులు ప్రభు, పాపారావు, మహేష్ మాట్లాడుతూ గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 21, 22వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రకటన ఇవ్వడం హర్షణీయమన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో ఎనిమిది గురుకుల కళాశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు మొదటి, రెండో విడత అంటూ కాలయాపన చేయకుండా ప్రతీ గిరిజన విద్యార్థికి సకాలంలో సీట్లు కేటాయించి విద్యా ప్రమాణాలు మెరుగుకు పీవో కృషి చేయాలని కోరారు. గత విద్యా సంవత్సరం సీట్ల కేటాయింపులో సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఒక గ్రూపులో సీటు కోసం దరఖాస్తు చేసుకుంటే మరో గ్రూపులో సీటు కేయించడం వంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు.



లగిశపల్లిలో వాధులతో బాధపడుతున్న పశువులతో రైతులు

వ్యాధులతో పశువులు విలవిల

జబ్బవాపు, డెక్కవాపు, గాలికుంటు వ్యాధులతో సతమతం

పాడేరు మండలం లగిశపల్లి పంచాయతీలో ఇప్పటికే 50 పశువులు మృతి

పట్టించుకోని అధికారులు... ఆందోళనలో పాడి రైతులు

పాడేరు రూరల్, మే 20: మన్యంలో వ్యాధులతో పశువులు విలవిలాడిపోతున్నాయి. జబ్బవాపు, డెక్కవాపు, గాలికుంటు వ్యాధులతో సతమతమవుతున్నాయి. ఇప్పటికే 50 పశువులు మృత్యువాత పడ్డాయి. ఈ సమస్య తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంతో పాడి రైతులు లబోదిబోమంటున్నారు.

మండలంలోని లగిశపల్లి పంచాయతీ కేంద్రంలో వ్యాధులతో పశువులు బాధ పడుతున్నాయి. జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లగిశపల్లి గ్రామంలో గత 15 రోజులుగా పశువులు జబ్బవాపు, డెక్కవాపు, గాలికుంటు వ్యాధులతో విలవిలలాడిపోతున్నాయి. దీంతో ఇప్పటికే 50 వరకు పశువులు మృత్యువాత పడ్డాయి. సమస్యను పశు సంవర్ధక శాఖాధికారులు ఎన్నిమార్లు తెలిపినా పట్టించుకోకవడం లేదని పాడి రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీజనల్‌గా ఈ ఏడాది పశువులకు వాక్సిన్ వేయాల్సి ఉండగా, నేటి వరకు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సచివాలయ వ్యవస్థ రాకముందు గ్రామాల్లో పశు మిత్రలు ఉన్న సమయంలో సకాలంలో వ్యాక్సినేషన్ జరిగేదన్నారు. సచివాలయం ఏర్పడిన తరువాత పశువైద్య సిబ్బంది ఎవరు ఉన్నారో తెలియడం లేదన్నారు. ఈ విషయంపై పశుసంవర్ధక శాఖ డీడీ చందక నరసింహులును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా లగిశపల్లిలో పశువుల వ్యాధులపై ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. మూడు రోజుల క్రితం కొన్ని పశువులకు వైద్య సేవలు అందించామన్నారు. అక్కడి పశువులకు అవసరమైన వ్యాక్సిన్‌ను సిద్ధం చేసినట్టు చెప్పారు. లగిశపల్లిలో మంగళవారం ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు

మావోయిస్టు యాక్షన్ టీములు సంచరిస్తున్నాయని అనుమానం



ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముంచంగిపుట్టు, మే 20: పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఎక్కడిక్కడ బృందాలుగా ఏర్పడి నిఘా పెట్టారు. మావోయిస్టు యాక్షన్ టీములు సంచరిస్తున్నాయనే నిఘా వర్గాల సమాచారంలో ఆంధ్రా, ఒడిశా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ముంచంగిపుట్టు, పెదబయలు, జోలాపుట్టు, కుమడ, లక్ష్మీపురం, సంగడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసులు ఈ తనిఖీలు చేపడుతున్నారు. స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి, గ్రామ పొలిమేరలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో సైతం తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి మండల కేంద్రం వైపు, ఇటు నుంచి ఒడిశా వైపు వెళ్లే వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. వాహన చోదకులకు సంబంధించిన రికార్డులు, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి విడిచి పెడుతున్నారు. అలాగే ఒడిశా ప్రాంతానికి చెందిన జోలాపుట్టు, ఒనకడిల్లీ, మాచ్‌ఖండ్ తదితర ప్రాంతాల్లో ఒడిశా పోలీసులు పలు చోట్ల గస్తీ కాస్తున్నారు. మారుమూల గ్రామాల మీదుగా సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు బలగాలు, ఒడిశాకు చెందిన బీఎస్ఎఫ్, ఎస్‌వోజీ పోలీసు బలగాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు, అపరిచితులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితం: డీఎంహెచ్‌వో

▸▸ ప్రసవానికి ముందే గర్భిణుల వసతి గృహంలో చేరాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

చింతపల్లి, మే 20: ఆస్పత్రిలో ప్రసవాలు సురక్షితమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) జమాల్ బాషా చెప్పారు. మండలంలోని తాజంగి, లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులు, ల్యాబ్, రికార్డులను తనిఖీలు చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గర్భిణులు కచ్చితంగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసవ సమయానికి ముందే చింతపల్లి గర్భిణుల వసతి గృహానికి గర్భిణులను తరలించాలని ఆయన ఆదేశించారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దోమల మందు పిచికారీని పర్యవేక్షించాలన్నారు. ప్రతి కుటుంబం గృహానికి పిచికారీ చేసుకునేలా చైతన్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి, వ్యాధులు ప్రబలిన వెంటనే వైద్య సేవలు అందించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోశ్‌కుమార్, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రదేశాల్లో 144 సెక్షన్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

గూడెంకొత్తవీధి, మే 20: ఓట్ల లెక్కింపు ప్రదేశాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ అప్పలనాయుడు చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జూన్ 4వ తేదీన 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అందువల్ల నలుగురికి మించి ఎక్కువ మంది గుమిగూడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గెలిచిన అభ్యర్థికి ఎటువంటి ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. మందుగుండు సామాన్లు కూడా కాల్చడానికి, సంబరాలు చేసుకోవడానికి అవకాశం లేదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మాడుగుల, మే 20 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ఆ ప్రాంత వాసులు తెలిపిన వివరాలివి. మాడుగుల జగ్గన్నచావడికి చెందిన గౌరీ పట్టపు సత్యనారాయణ (50) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. కాసేపటికి ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు జరిపిన వైద్యులు అప్పటికే అతడు మృతిచెందినట్టు నిర్ధారించారు. సత్యనారాయణ కార్పెంటర్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ ఘటనతో అతని భార్య పద్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అయితే ఈ సంఘటనపై సోమవారం రాత్రి 7.30 గంటల వరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు.

'ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య'

బుచ్చెయ్యపేట, మే 20 : కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం సీపీఎం నాయకుడు పినపాత్రుని సాంబశివరావు ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొంతిన సన్నిబాబు, బత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

మూగ జీవాలకు సక్రమంగా సేవలు అందించండి

▸▸ పశు సంవర్ధక శాఖ ఏడీ రాజేశ్వరరావు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ రాజేశ్వరరావు

డుంబ్రిగుడ, మే 20: మూగజీవాలకు సక్రమంగా సేవలు అందించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రాజేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని పశు వైద్య శాఖ కార్యాలయాన్ని సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కించుమండ, డుంబ్రిగుడ పశు వైద్య సిబ్బందితో పాటు రైతుభరోసా కేంద్రాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న పశుసంవర్ధ సయహాకులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. మూగజీవాలకు వెంటనే వైద్యసేవలు అందించడానికి సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

24న సర్వసభ్య సమావేశం

జి.మాడుగుల, మే 20: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 24న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లోహిత్ జయ సాగర్ తెలిపారు. ఎంపీపీ పద్మ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ గిరిజనుడికి పరిహారం ఇవ్వాలి

గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్



బాధితుడు రాందాస్‌ను పరామర్శిస్తున్న బాల్‌దేవ్

అరకులోయ, మే 20: ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ గిరిజనుడిని ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాల్‌దేవ్ కోరారు. ఈ మేరకు అరకు అస్పత్రిలో చికిత్స పొందుతున్న శిరసగుడ గ్రామానికి చెందిన బాధితుడు రాందాస్‌ను సోమవారం ఆయన పరామర్శించారు. రెండు చోట్ల ఎలుగుబంటి దాడి చేయడంతో 11 కుట్లు పడ్డాయని బాధితులు వారికి తెలిపారు. ఐటీడీఏ స్పందించి రాందాస్ కుటుంబ పోషణ నిమిత్తం తక్షణమే పరిహారం ఇవ్వాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఉపాధి అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా బాలదేవ్ విజ్ఞప్తి చేశారు.

నాడు-నేడు రెండో దశ పనులు పూర్తిచేయాలి

గూడెంకొత్తవీధి, మే 20: నాడు-నేడు పథకం కింద రెండో దశ ప్రారంభించిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మండల విద్యా శాఖాధికారి కె.రామన్న సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండో దశలో పాఠశాలలకు మంజూరైన నాడు నేడు పనులను వేగవంతం చేసి ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీలు పాల్గొన్నారు.

సుత్తిగుడ పాఠశాలకు నూతన భవనం నిర్మించరూ..

ముంచంగిపుట్టు, మే 20: మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో పాఠశాల నూతన భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం గ్రామస్థులతో పాటు సర్పంచ్ కె.త్రినాథ్ మాట్లాడుతూ ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం కాలం చెల్లిపోవడంతో సుమారు ఐదేళ్ల క్రితం నేలమట్టం చేసినట్టు చెప్పారు. నూతన పాఠశాల భవన నిర్మాణానికి నాడు-నేడు పథకం కింద నిధులు సుమారు ఏడాది క్రితం విడుదలయ్యాయని, పనులు ఎందుకు మధ్యలో ఆపేశారని సంబంధిత అధికారులను అడగగా ప్రశ్నించగా, నిధులు వెనక్కి వెళ్లిపోయాయని బదిలీ ఇస్తున్నారు. దీంతో చిన్నపాటి గదిలోనే పాఠశాల నిర్వహణ జరుగుతుందని వారు తెలిపారు. చిన్న గదిలో చదువుకొనేందుకు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈ విద్యా సంవత్సరమైనా పాఠశాలలు తెరిచే లోపు నూతన భవన నిర్మాణం పనులు పూర్తయ్యేలా విధంగా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

అటవీ సెక్షన్‌లో అక్రమాలెన్నో?

... 3వ పేజీ తరువాయి

మలబారు వేపచెట్లు నరికించినట్టు సమాచారం. ఈ వ్యవహారమంతా కొయ్యూరు అటవీ సెక్షన్ సిబ్బంది మూకుమ్మడిగా స్మగ్లర్లతో చేతులు కలిపి చేసినట్టు తెలిసింది.

వాటాల పంపిణీలో తేడా రావడంతో..

గత రెండు నెలలుగా జరుగుతున్న ఈ వ్యవహారానికి సంబంధించిన వాటాల పంపిణీలో తేడాలు రావడంతో సిబ్బంది ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకోవడంతో మొత్తం వ్యవహారం బయట పడింది. దీంతో గత వారం రోజులుగా కొయ్యూరు అటవీ సెక్షన్ పరిధిలో జరిగిన అక్రమాలపై అటవీశాఖకు చెందిన రాష్ట్ర విజిలెన్స్ సిబ్బంది విచారణ జరిపి చింతవానిపాలెం, కొత్తపల్లి అటవీ ప్రాంతంలో 142 నల్లమద్ది మొద్దులు(మొదళ్లు) గుర్తించారు. అలాగే సోలాబు పాత టేకు ప్లాంటేషన్‌లో స్క్వాడ్ డీఎఫ్‌వో బృందం పరిశీలించి 29 టేకు మొదళ్లు గుర్తించగా, విజిలెన్స్ అధికారులు మరో 21 మొదళ్లు గుర్తించారు. ఇవి కాకుండా అంతాడ, ఎద్దుమామిడి, సింగధార అటవీ ప్రాంతంలో స్క్వాడ్ సిబ్బంది 20 టేకు చెట్లు, మలబారు వేప మొదళ్లు గుర్తించారు. కాగా కొయ్యూరు సమీప చింతవానిపాలెం గొల్లువలస మధ్య ఈ సిబ్బంది సహకారంతో పోడు వ్యవసాయం పేరుతో 106 తంగిడ చెట్లు నరికించారు. కొయ్యూరు సెక్షన్ పరిధిలో ఇంత జరుగుతున్నా ఏ మాత్రం విషయం బయటపడకుండా చింతపల్లి డీఎఫ్‌వోతో పాటు మిగిలిన ఉన్నతాధికారుల బృందాలు గోప్యంగా వ్యవహారంపై విచారణ జరపడం, వచ్చిన ప్రతిసారీ విషయాన్ని పక్కదారి పట్టించేలా దాడులు నిర్వహించినట్టుగా చిత్రీకరించుకుని వెళ్లడం చూస్తే ఈ అక్రమాల వెనుక పెదవలస రేంజ్ అధికారితో పాటు పలువురి హస్తం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణను వివరణ కోరగా అవినీతి జరిగిన మాట వాస్తవమేనన్నారు. వీటన్నింటిపై ఇప్పటికే విజిలెన్స్, స్క్వాడ్ డీఎఫ్‌వో విచారణ జరిపి నివేదికలు ఇచ్చారన్నారు. కొయ్యూరు అటవీ సెక్షన్ పరిధిలో బీట్ ఆఫీసర్లుగా పని చేస్తున్న రాజ్‌కుమార్, రాకేశ్‌ల హస్తం ఉందని తేలిందన్నారు. అలాగే ఇందుకు సంబంధించి సెక్షన్ ఆఫీసర్, రేంజర్‌పై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



చింతవానిపాలెం అటవీ ప్రాంతంలో నల్లమద్ది మొదలు